క్లుప్తంగా

తంగెళ్ళమూడి సర్పంచి మృతి



కిషోర్‌బాబు (ఫైల్)

పెదకాకాని: అనారోగ్యంతో తంగెళ్ళ మూడి సర్పంచి జిల్లెళ్ళ కిషోర్ బాబు(45) మరణించారు. పెదకాకాని మండలం, తంగెళ్ళ మూడి గ్రామానికి చెందిన జిల్లెళ్ళ కిషోర్‌బాబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మంగళ గిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం 6 గంటలకు మరణించారు. ఆయనకు కరోనా రావడం తోపాటు రెండేళ్ల కిందట కుమార్తె మరణించడంతో మానసికంగా కుంగిపోయారు. కిషోర్ బాబుకు భార్య సంగీత, కుమారుడు అరుణ్‌దీపక్, ఏడాదిన్నర పాప స్మైలీ ఉన్నారు. సర్పంచి మరణ వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సాయంత్రం 5 గంటలకు కిషోర్‌బాబుకు తుదివీడ్కోలు పలికారు.

గ్రంథాలయాలను మరువకూడదు



కాకుమాను: సమాజంలో ప్రతి ఒక్కరు గ్రంథాలయాల ప్రాధాన్యతను మరువకూడదని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు గ్రంథాలయంలో లభిస్తున్న వివిధ పుస్తకాలను చదివి మేధో సంపత్తిని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. గ్రంథాల పఠనం వలన ప్రపంచంలో జరిగే అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. శిబిరంలో విద్యార్థులు తయారు చేసిన సృజనాత్మక కృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, ఉపాధ్యాయులు చిరంజీవి, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులు సమర్థంగా నిర్వర్తించాలి



ప్రత్తిపాడు: ఉద్యోగులు సమర్థంగా విధులు నిర్వర్తిస్తే ప్రజా మన్ననలు పొందవచ్చని ఎంపీడీవో కె. శివపార్వతి అన్నారు. ప్రత్తిపాడు మండల ఈవోపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా క్రోసూరు మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రవికుమార్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీవో కె. శివపార్వతిలు రవికుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విధి నిర్వహణలో ఇబ్బందులన్నింటినీ అధిగమించి విధులను నిర్వర్తించుకోవాలని చెప్పారు. మండల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని రవికుమార్ అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత



చేబ్రోలు: పేదలకు సాయం అందించటమే లక్ష్యంగా లుక్ కల్చర్ మీడియా లిమిటెడ్ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తున్నట్లు ప్రతినిధి సోనియా తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెంలోని తెనాలి ప్రధాన రోడ్డు పక్కన నివసిస్తున్న 30 పేద కుటుంబాలకు శనివారం నిత్యావసర వస్తువులు అందజేశారు. చెరుకుపల్లికి చెందిన సోనియా లుక్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేజండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి బాబురావు, అనూష, జ్యోత్స్న, రోజా, గంగాభవాని, స్వప్న, సుభాషిణి, సంధ్యారాణి, జయరాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులకు హోంమంత్రిదే బాధ్యత

నెహ్రూనగర్: రాష్ట్రంలో దళితులపై దాడులు, అకృత్యాలపై హోంమంత్రి సమాధానం చెప్పాలి.. లేదా రాజీనామా చేయాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శశికుమార్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పిఠాపురం నియోజకవర్గం మల్లాంలో దళితుల సాంఘిక బహిష్కరణ, దప్పళంపాడులో మాదిగల సాంఘిక బహిష్కరణ, వలపర్ల కల్పనపై పోలీసులు దౌర్జన్యం, ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతుంటే హోంమంత్రి మౌనంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు.

వైఎస్సార్ సీపీలో కష్టపడే వారికి ప్రాధాన్యం

- పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం
- పార్టీ మండల అధ్యక్షుడిగా ఆళ్ల శ్రీరామిరెడ్డి పేరు ప్రతిపాదన



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ



సమావేశానికి హాజరైన నాయకులు

చేబ్రోలు: వైఎస్సార్ సీపీలో కష్టపడే వారికే అధిక ప్రాధాన్యత ఇచ్చి అందరి సహకారంతో పార్టీని బలోపేతం చేయనున్నట్లు పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలోని చిన్ని కృష్ణారెడ్డి కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్ సీపీ మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా పూర్తికాక ముందే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో ధైర్యంగా పనిచేసిన ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. అందరికీ న్యాయం జరిగిలా చూస్తామన్నారు. ఐక్యంగా పనిచేసి వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి సీఎం చేయటమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బజరంగ్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని 68 గ్రామాల్లో ఎన్నికలకు ముందు రెండేళ్లు 33 వేల మందికి సేవలు అందించినట్లు తెలిపారు. వైద్య శిబిరాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడిని కార్యకర్తలు, నాయకులు ఏకాభిప్రాయంతో ఎంపిక చేసుకోవాలన్నారు. మొత్తం ఏడుగురు పేర్లు ప్రతిపాదనకు వచ్చాయి. వీరిలో పార్టీ సీనియర్ నాయకుడు, వేజండ్ల మాజీ గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి పేరు ఖరారు కావడంతో, ఈ మేరకు అధిష్టానానికి వివరాలు పంపనున్నట్లు ప్రకటించారు. వారం రోజుల్లో పార్టీ కమిటీల నియామకం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 30 అనుబంధ సంఘాలు ఉన్నాయన్నారు. వీటితోపాటు బూత్ కమిటీల ఎంపిక ప్రక్రియను ఏకాభిప్రాయంతో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, బత్తుల గోవిందరాజులు, కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, కాసు ఈశ్వర రెడ్డి, ఆళ్ల శ్రీరామిరెడ్డి, మురళీకృష్ణ, ఎం.వెంకట రెడ్డి, జువ్వా ఏడుకొండలు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతపై దృష్టి



మొక్క నాటుతున్న డీఎల్‌పీవో కె. శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీవో కె. శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో పంచాయతీ కార్యదర్శి మూర్తి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్రలో భాగంగా శనివారం బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎల్‌పీవో శ్రీనివాసరావు హాజరయ్యారు. గ్రామంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాలెపు కుమారి, వార్డు సభ్యులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఎస్‌డబ్ల్యూపీసీలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రజలు తమ గృహాల్లోనే తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను పూర్తి స్థాయి వినియోగంలోనికి తీసుకురావాలని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపీసీల్లో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. తదనంతరం బీట్ ద హీట్‌లో భాగంగా స్థానిక మెయిన్ రోడ్డులోని బస్ షెల్టరులో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక నాయకులు వెలివెల్లి సుబ్బారావు, గింజుపల్లి సుబ్బారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతో అదుపులో రక్తపోటు



మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక

ప్రత్తిపాడు: జీవన శైలిలో స్వల్ప మార్పులు చేసుకుంటే రక్తపోటును అధిగమించవచ్చని, బీపీ సైలెంట్ కిల్లర్ అని ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం జనరల్ మెడిసిన్ వైద్యాధికారి డాక్టర్ మౌనిక రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సీహెచ్‌సీలో డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో రక్తపోటు, గుండె జబ్బులపై రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, యాంత్రిక జీవనం, శారీరక, మానసిక రుగ్మతలు, అధిక ఒత్తిడి, నిద్రలేమి, అధిక ఉప్పు, ధూమపానం, మద్యపానం కారణంగా యుక్తవయస్సు వారు కూడా బీపీ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యాధి బయటకు కనిపించనప్పటికీ అలసత్వం వహిస్తే పెద్ద వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడి తగ్గించుకుని నిత్యం వ్యాయామం, యోగా, ధ్యానం చేస్తూ ప్రశాంతంగా జీవనం అలవరుచుకోవాలని సూచించారు. బీపీని ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ అదుపులో ఉంచుకోవాలని కోరారు. ఆహారంలో ఉప్పు తక్కువగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

చినుకు పడితే ముురుగు పరుగే..



ఈ చిత్రాన్ని చూసి చెరువో, మురుగు కాలువో అనుకుంటే బురదలో కాలు వేసినట్లే. ప్రత్తిపాడు నుంచి పదహారో నంబరు జాతీయ రహదారిని అనుసంధానం చేసే రోడ్డు ఇది. నడింపాలెంలో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్నపాటి వర్షాలకు సైతం ఇలా చెరువును తలపిస్తోంది. శనివారం సాయంత్రం కురిసిన ఓ మోస్తరు వర్షానికి గ్రామంలోని ప్రధాన రహదారి వర్షపు నీరు, బురదతో నిండిపోయింది. స్థానికులు కర్రల సాయంతో మురుగును ముందుకు పారించేందుకు నానా పాట్లు పడ్డారు.

– ప్రత్తిపాడు

నేటి నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఈఓ సుభద్ర, చైర్మన్ దుర్గావరప్రసాద్

నగరంపాలెం: నగరంలోని కొత్తపేట(నాజ్ కూడలి) శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు ఆదివారం నుంచి 22వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. శనివారం దేవస్థానం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జయంత్యుత్సవాల వాల్‌పోస్టర్లను కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ షేక్ సజీల, దేవస్థానం ఈఓ టి.సుభద్ర, చైర్మన్ సూరినేడి దుర్గావర ప్రసాద్, శ్రీ హనుమాన్ దీక్షా సమాజం గౌరవాధ్యక్షులు తిరువల్లూరు వెంకట సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ స్వామి వారి హనుమజ్జయంతిలో భాగంగా ఈనెల 18వ తేదీ రాత్రి అంకురార్పణ, 19 ఉదయం పది గంటలకు లక్ష తులసి పూజ, 20వ తేదీ ఉదయం పది గంటలకు లక్ష మల్లెల పూజ, 21 ఉదయం పది గంటలకు లక్ష ఆకు పూజ, రాత్రి 8 గంటలకు శ్రీహనుమాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో స్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. 22న హనుమత్ జయంతి సందర్భంగా ఉదయం 11 గంటలకు స్వామి వారికి సహస్ర ఘట్టాభిషేకం, రాత్రి 8 గంటలకు శ్రీసువర్చలా ఆంజనే యస్వామి కల్యాణం, 23 ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదాన ప్రసా ద వితరణ ఉంటుందని తెలిపారు. ఆలయ ముఖ్య అర్చక స్వామి నరసింహచార్యులు, శ్రీహను మాన్ దీక్షా సమాజం సభ్యులు చేపల నాగేశ్వరరావు, మాశీ ప్రసాద్, రమేష్, వెంకటరమణ, మారుతి, సుబ్రమణ్యం, బాపిరాజు, టీడీపీ నేతలు కొనకళ్ల సత్యం, తిరువళ్లూరి పద్మావతి మాట్లాడారు.

- గుంటూరు కొత్తపేట(నాజ్ కూడలి)లోని ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆలయం సాధువు క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. బావాజీ వారి పోషణలో కొంత కాలం పోషించబడగా, 1975లో దేవదాయ శాఖకు అప్పగించారు. ఈ స్వామి వారు భక్తులపాలిటి పెన్నిధి, భక్తుల కోరికలను నెరవేర్చే కల్పవృక్షంగా భాసిల్లుతున్నారు. జయంత్యుత్సవాల్లో భాగంగా దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందుల్లేకుండా మౌళిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. స్వామి వారిని దర్శించుకునే ఒదుకు రద్దీ లేకుండా ఉండేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

రివైజ్డ్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో గత ఏడాది అక్టోబరులో విడుదల చేసిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి రివైజ్డ్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శనివారం తెలిపారు. సవరించిన మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. మెరిట్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ధ్రువపత్రాలతో అందజేయాలన్నారు.

బ్యాంకు ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

గుంటూరు మెడికల్: కొండిన్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో బ్యాంక్, ఆర్.ఆర్.బి, ఎస్.ఎస్.సి. పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు అకాడమీ చైర్మన్ డాక్టర్ ఇ.వి.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా ,పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామ శివారులోని కొండిన్యపురంలో సేవా దృక్పథంతో నిర్మించిన కొండిన్య ఐఏఎస్ అకాడమీ భవనంలో మే 31 నుంచి కోచింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కోచింగ్ లో ఆయా పాఠ్యాంశాలలో విశేష అనుభవం ఉన్న నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఉద్యోగం సాధించాలనే ఏకైక లక్ష్యం గలవారే సంప్రదించాలని కోరారు. మహిళా అభ్యర్థులకు ఉచిత నివాస వసతి కల్పిస్తామన్నారు .ఆసక్తిగల వారు కొండిన్య ఐఏఎస్ అకాడమీలో, మొబైల్ నెంబర్ 99661 12933కు సంప్రదించాలని కోరారు.

నీళ్ల ప్లాంట్ స్వాధీనానికి పచ్చజెండా

పంచాయతీ పాలకవర్గ సమావేశంలో ఆమోదం



సమావేశంలో వార్డు సభ్యుల మధ్య వాగ్వాదం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు రక్షిత మంచినీటి చెరువు కట్టపై ఉన్న వాటర్ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకునేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్లాంట్‌కు బహిరంగ వేలం పాట నిర్వహించాలని వార్డు సభ్యులు కోరడంతో లైన్ క్లియర్ అయింది. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయంలో శనివారం పాలకవర్గ సమావేశం జరిగింది. వాటర్ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకోకుండా ఇంకా మాటలు చెబుతారని వార్డు సభ్యుడు డబ్బూరి వెంకటేశ్వర్లు అధికారులను ప్రశ్నించారు. ప్లాంట్‌కు పంచాయతీ ఇచ్చిన గడువు ముగిసి సంవత్సరాలు గడుస్తున్నా ఎందుకు తాత్సారం చేస్తున్నారని సెక్రటరీని నిలదీశారు. మరో వార్డు సభ్యుడు కాకాని సురేష్ కలుగజేసుకోవడంతో ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం స్పందించిన కార్యదర్శి ఖాజా.. ఇప్పటికే రెండుసార్లు వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఫైనల్ నోటీసు జారీ చేసి ప్లాంట్‌ను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి నుంచి అనుమతి తీసుకుని ప్లాంట్ నిర్వహణకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని సెక్రటరీ తెలిపారు.

టెండర్ల అంశం వాయిదా

ఇదిలా ఉంటే 2025–26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీకి పీహెచ్ సామగ్రి, పీడబ్ల్యూఎస్ సామగ్రి, ఎలక్ట్రికల్, స్టేషనరీ సరఫరా చేయుటకు తక్కువ ధరకు కోట్ చేసిన టెండరును ఆమోదించే విషయాన్ని ప్రస్తుత సమావేశంలో వాయిదా వేయాలని గ్రామ సర్పంచ్ వసువర్తి రమాదేవి ప్రతిపాదించడంతో వార్డు సభ్యులు ఆమోదించారు. మరోసారి టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేసి కొత్త వాటిని ఆహ్వానించాలని తెలిపారు. దీంతో సమావేశంలో ఉప సర్పంచ్ బాపతు వెంకటేశ్వర రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

• గుంత పూడలేదు.. గండం తప్పడం లేదు



ఇక్కడ కనిపిస్తున్న చిత్రాన్ని చూడండి. గద్దెనెక్కిన నాటి నుంచి సంక్రాంతికల్లా గుంతల్లేని రోడ్లు ఉంటాయని కూటమి పెద్దలు అన్ని వేదికలపై మాటలు చెప్పారు. అవన్నీ అబద్ధాలే అని చెప్పేందుకు నిలువెత్తు నిదర్శనం ఈ చిత్రం. ఇది ప్రత్తిపాడు నుంచి అబ్బినేనిగుంటపాలెం, రావిపాడు మీదుగా వంగిపురం వెళ్లే ప్రధాన రహదారి. రోడ్డు అంతా గోతులమయమై ప్రయాణం నరకంగా మారింది. వానలు పడితే మోకాలి లోతు గుంతల్లో నీరు నిలిచి వాహనం నడపాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకొంది. పాలకులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గం ద్వారా ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల ప్రజలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు.

- ప్రత్తిపాడు

పెట్రోలు బంకుల్లో నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

నెహ్రూనగర్: పెట్రోల్ బంకుల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధూరి చెప్పారు. శనివారం పెట్రోల్ బంక్ డీలర్లతో పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు వారి యొక్క వాహనాల్లో పెట్రోల్/డీజిల్ నింపే సమయంలో మీటర్ రీడింగ్ జీరో చూపించాలని పేర్కొన్నారు. కొలతల్లో తేడా ఉన్నట్లు అనుమానం వస్తే లీగల్ మెట్రాలజీ వారిచే సర్టిఫై చేసిన ఐదు లీటర్ల కొనికల్ మెజర్‌తో పెట్రోల్, డీజిల్ కొలత చూసుకునేలా అవకాశం కల్పించాలన్నారు. పెట్రోల్ నాణ్యతపై ఫిల్టర్ పేపర్ ద్వారా నివృత్తి చేయాలన్నారు. బంకు నిర్వాహకులు తాము ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ ఫ్యూయల్ డిస్పెన్సింగ్ పంప్‌ను క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం విధిగా లీగల్ మెట్రాలజీ వారిచే ధ్రువీకరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ టి.షాలెంరాజు, అసిస్టెంట్ కంట్రోలర్లు జీ కొండారెడ్డి, అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్లు అల్లూరయ్య, షేక్ జానా సైదా, ఐఓసీ, హెచ్‌పీసీ, బీపీసీ సేల్స్ ఆఫీసర్స్ వెంకట శివ, ప్రవీణ్, కునాల్, చంద్రకాంత్, గుంటూరు, పల్నాడు జిల్లాల పెట్రోలియం అసోసియేషన్ డీలర్లు పాల్గొన్నారు.

బరువులెత్తి.. పతకాలు కొల్లగొట్టి..!

- వెయిట్ లిఫ్టర్‌గా జాతీయస్థాయిలో గుర్తింపు
- సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి రాణింపు
- స్ఫూర్తిగా నిలుస్తున్న యువకుడు వెంకటేష్



హిమాచల్ ప్రదేశ్‌లో సిల్వర్ మెడల్ పొందిన వెంకటేష్

అందరూ కలలు కంటారు. కానీ కొందరే వాటిని నెరవేర్చుకుంటారు. ఆ దిశగానే సామాన్య రైతు కుటుంబంలో పుట్టినా వచ్చిన అవకాశాలను కృషి, పట్టుదలతో సద్వినియోగం చేసుకుని సత్తా చాటుతున్నారు గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన 18 ఏళ్ల వెయిట్ లిఫ్టర్ చెంచు వెంకటేష్. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

పొన్నూరు: సాధారణ రైతు కుటుంబానికి చెందిన వెంకటేష్‌కి చిన్నప్పటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ అంటే మక్కువ. పాఠశాల స్థాయి నుంచి పట్టుదలతో కఠోర సాధన చేశారు. శిక్షకుల తర్ఫీదుతో రాటుదేలారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఈ యువకుడు జిల్లాలు, రాష్ట్రాలు దాటి జాతీయస్థాయిలో మంచి వెయిట్ లిఫ్టర్‌గా ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం ములుకుదురు గ్రామానికి చెందిన రైతు చెంచు చంద్రశేఖర్ చిన్న కుమారుడు వెంకటేష్. మట్టిలో మాణిక్యంలా తనకు ఎంతో ఇష్టమైన వెయిట్ లిఫ్టింగ్‌లో విశేషంగా రాణిస్తున్నారు. ఐదు నుంచి పదో తరగతి వరకు జిల్లాలోని కాజలో చదివారు. ఇంటర్ చీరాలలో పూర్తి చేసి ప్రస్తుతం పొన్నూరు పట్టణంలోని పీబీఎస్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.

చిన్ననాటి నుంచే..

వెంకటేష్ తన 11వ ఏటే ఏఎస్‌యూ శిక్షకులైన అమర్‌నాథ్ వద్ద తర్ఫీదు పొందారు. 2017 – 20 మధ్య శిక్షణ పొంది ఔరంగబాద్ నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ అకాడమీకి ఎంపికయ్యారు. అక్కడ శిక్షణ పొందుతూనే రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించారు. 2024 నవంబరులో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ పొందారు. ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు బిహార్‌లో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్ సాధించారు.

తండ్రి ప్రోత్సాహంతోనే విజయాలు



అంతర్జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టర్‌గా ఎదగాలని నా ఆకాంక్ష. తండ్రి ప్రోత్సాహంతోనే ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో రాణించాను. మరిన్ని పోటీల్లో విజేతగా నిలిచి నాన్న ఆశయాన్ని నెరవేరుస్తా. మంచి క్రీడాకారుడిగా దేశానికి పేరు తీసుకురావాలని కోరిక.

– చెంచు వెంకటేష్, వెయిట్ లిఫ్టర్

గ్యాస్ ఆధారిత దహనవాటిక ప్రారంభం



నెహ్రూనగర్: మహాప్రస్థాన సేవా సమితి స్ఫూర్తితో గుంటూరు నగరంలోని శ్మశాన వాటికలను మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. శనివారం బొంగరాలబీడులోని నగర పాలక సంస్థ హిందూ శ్మశాన వాటికలో నూతనంగా నిర్మించిన గ్యాస్ ఆధారిత దహన వాటికను, ఫ్రీజర్ రూమ్‌ను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మహాప్రస్థాన సేవా సమితి సభ్యులతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్, కేరళలో పలు నగరాల్లో సమితి సభ్యులు పర్యటించి, గ్యాస్ ఆధారిత దహన వాటిక ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో దశల వారీగా అన్ని శ్మశానాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.